

# నాకూ పెళ్ళవుతుంది!

కొండముది రుక్మిణీదేవి

వైశాఖమాసం ఎండ చండ్ర నిప్పులు చెరుగుతున్నది. పగలు పదిగంటలు దాటితే బయటకు రావటానికి జంకుతున్నారు జనం.

ఇంట్లో అందరం భోజనాలు చేస్తుండగా ఒగరుస్తూ సుడిగాలిలా వచ్చిన శాంతి నన్ను చూసి,

"ఎప్పు డొచ్చావేవ్ ? కులాసాగా ఉన్నావా ? మీ ఆయనకు ప్రమోషన్ వచ్చిందటగా ? నీ కూతురికి పెళ్ళెప్పుడు చేస్తావ్ ? ఆ ! ... అన్నట్లు ఎన్నాళ్ళుంటా విక్కడ ? నాకూ పెళ్ళి కుదిరేలా ఉందేవ్, నువ్వు తప్పకుండా ఉండాలి సుమా ! లేకపోతే ఊరుకోను," అంటూ ప్రశ్నలవర్షం కురిపించి, నా సమాధానాలకు ఎదురు చూడకుండా, వచ్చినంత తొందరగానూ వెళ్ళిపోయింది.

"ఆ ! ... సంబధమే ! దాని పెళ్ళి సరే, అదీ సరే ! ఈ మధ్య సిగ్గు,

బిడియం వదిలిపెట్టికనిపించిన స్నేహితురాలికల్లా ఈ పిల్ల ఇదే ధోరణిలో చెప్పటం మొదలుపెట్టింది," అన్నది విసుగ్గా.

అమ్మ మాటలతో ఈ లోకంలోకి వచ్చిన నేను, "కుదిరిందేమోనే పాపం!" అన్నాను, కొంచెం సానుభూతిగా.

"సడేలే ! ఇన్నేళ్ళు వచ్చాకా ... ? పైగా ఈ మధ్య దాని మైండ్ కేదో అయిందని వైద్యం చేయించారు," అన్నది అన్నంలో మజ్జిగపోస్తూ !

అమ్మ మాట నిజమే ననిపించింది నాకు ఆ క్షణంలో. శాంతిని గురించి ఆలోచిస్తూనే కంచంలో చెయికడుక్కొని వెళ్ళి మంచంమీద పడుకుని పుస్తకం తెరిచాను. పుటలు ముందుకు జరుగుతున్నయ్. మనస్సు గతంలోకి పరుగెత్తింది.

శాంతి మా పక్కింటి మాష్టరుగారమ్మాయి. ఆమె, నేను ఒకే వయసు వాళ్ళం. బి. ఏ. వరకు కలిసి చదువుకున్నాం. ఆఖరు సంవత్సరం పరీక్షల ముందు శాంతి తండ్రి గుండెపోటు వచ్చి హఠాత్తుగా పోయారు. దాంతో, చేతికి అందివచ్చిన కూతురు శాంతి, ఆ కుటుంబం వీధిన పడకుండా ఆఫీసులో క్లర్కుగా చేరి, కుటుంబ సంరక్షణ నెత్తిన వేసుకున్నది. తండ్రి పోయినప్పుడు వచ్చిన ప్రావిడెంటు ఫండు, ఇన్సూరెన్స్ కలసిన చిన్న మొత్తం అండగా పెట్టుకుని, తన సంపాదనతో ముగ్గురు చెల్లెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు, తల్లి, తను గుట్టుగా బ్రతికేవాళ్ళు. ఆ తరువాత నాకూ పెద్దగా చదువుమీద శ్రద్ధలేక ఇంటెదగ్గరే ఉన్నాను. ప్రతిరోజూ శాంతి ఆఫీసునుంచి రాగానే, స్నానం చేసి, తెల్లని వాయిల్‌చీర కట్టుకుని, నాగుపాములాంటి వాలుజడలో ఒక్క గులాబీని అందంగా అమర్చుకుని, నాకూ ఒక గులాబీపువ్వు తీసుకొని మా ఇంటికి వచ్చేది.

ఆమె, నేను మేడమీద కూర్చుని గంటలతరబడి కబుర్లు చెప్పుకునేవాళ్లం. చివరకు కిందనుంచి అమ్మ పిలిస్తేగాని భోజనానికి టైము అయిందని తెలిసేది కాదు మాకు. మా మాటల్లో శాంతి ఆఫీసు విషయాలు, వాళ్ళ కుటుంబ విషయాలు, పిల్లల చదువులు, మా ఇంట్లో మా నాన్నగారి ప్రమోషను, అన్నయ్య అమెరికా వెళ్ళటానికి జరుగుతున్న ప్రయత్నాలు, నా పెళ్ళి సంబంధాలు, ఒకటనేమిటి అన్నీ దొర్లుతుండేవి.

ఆ రోజు శాంతి మామూలు టైముకే మా ఇంటికి వచ్చింది. కాని, ఆమె రాకకోసం మధ్యాహ్నంనించి ఎదురు చూస్తున్న నాకు ఎంతో ఆలస్యంగా వచ్చినట్లనిపించి, ఎదురువెళ్ళి, "ఇంత ఆలస్యం చేశావేం ?!" అన్నాను.

"నేను మామూలు టైముకే వచ్చాను.

కావాలంటే ప్రైము చూడు" అన్నది శాంతి చిలిపిగా.

ఆవేళ దాని మాటల్లో చిలిపితనం, చూపుల్లో కొంటెతనం, బుగ్గల్లో ఎర్రదనం కనిపించాయి నాకు. నా సంతోషాన్ని పంచుకునే మొదటి వ్యక్తి శాంతి. నా మనసులో సుళ్ళు తిరుగుతున్న ఆలోచనల్ని ఎలా మాటల రూపంలో పెట్టాలా అని, ఆలోచిస్తుండగానే, "నీకో ముఖ్యమైన విషయం చెప్పాలి సునీతా !" అన్నది శాంతి. అప్పటికే ఆమె చెంపలు కెంపులయ్యాయి.

"ఏమిటది ?" ఆత్రంగా అడిగాను.

"ఏంలేదులే ... !" మొహమాటపడుతున్నట్లు అన్నది.

"అంత చెప్పకూడని రహస్యమా ? పోన్లే అయితే !" నిష్ఠూరంగా అన్నాను.

"లేదు సునీతా ! ముందుగా నీకే చెబుదామని వచ్చాను. నేను...నేను... ఒక నిర్ణయానికి వచ్చాను" అన్నది.

ఆ మాటతో నాకు మరీ ఉత్సాహం వచ్చి, "ఏమిటీ, ఏమిటి నీ నిర్ణయం? త్వరగా చెప్పు," అన్నాను దాని భుజాలు పట్టి కుదుపుతూ.

" మరే ... మరి ... మా ఆఫీసులో ... "

"ఆ !...ఆఫీసులో..."

"నా కోలీగ్ సూర్యం ... మాట పూర్తికాకుండానే సిగ్గు ముంచుకు వచ్చి, కళ్ళు తళుక్కున మెరిసి, హృదయం బరువెక్కి శాంతికి మాటలు కరువైనయ్! క్షణం నా కళ్ళల్లోకి చూసి తలదించుకున్నది.

"అమ్మ దొంగా ! ఇదా సంగతి. అయినా ఇంత ఆలస్యంగానా నాకు చెప్పటం ? ఏంచేస్తున్నా డన్నావ్ ? నీ కొలీగా ? అందంగా ఉంటాడా ?"


మౌనం వహించింది శాంతి.

"హుషారైనవాడేనా? ఆస్తిఉన్నదా? అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఉన్న పెద్ద కుటుంబమేనా ? " అంటూ ఊపిరాడకుండా ప్రశ్నలు వేశాను.

"చెప్పనీ సునీతా ! ఆయన నాలాగా బి.ఏ. చదవలేదు. ఒక అనాథ శరణాలయం ఆయన్ని పెంచి పెద్దచేసి యల్. డి. సి. గా తయారుచేసింది. అందం అంటావా, అంగసౌష్టవానికి లోటులేదు. ఆస్తి లేకపోయినా ఆత్మాభిమానం ఉంది. నా కెందుకో ఆయన ప్రవర్తన బాగా నచ్చింది."

"అదృష్టవంతురాలివి. నీ అంత చొరవ చెయ్యలేని నేను, అమ్మా, నాన్న స్థిరపరచిన పెళ్ళిచేసుకోబోతున్నాను" అన్నాను ఇన్‌ఫీరియారిటీ ఫీలవుతూ.

"చాలా బావుంది సునీతా! మనిద్దరం ఒకే సంవత్సరంలో పుట్టాం. ఒకచోటే పెరిగాం. ఇద్దరం ఒకే డిగ్రీ తీసుకున్నాం. చివరగా ఒకేసారి జీవితంలో స్థిరపడబోతున్నాం. మనిద్దరికీ ఆర్థిక



మైన వ్యత్యాసం ఉన్న మన స్నేహానికి, జీవిత విధానానికి అది అడ్డుతగల్లేదు" అన్నది మెల్లగా నవ్వుతూ.

ఆ తరువాత శాంతి నాలుగురోజుల దాకా మా ఇంటికి రాలేదు. అప్పటికే మా ఇంట్లో పెళ్ళిసందడి ప్రారంభమయింది. ఆ నాలుగు సాయంకాలాలు శాంతికోసం ఎదురుచూసిన నేను ఇహ ఉండబట్టలేక వాళ్ళింటికి వెళ్ళాను, 'తన పెళ్ళి ఏర్పాట్లు తనే చూసుకోవాలిగదా అందుకే వచ్చి ఉండదు అనుకుంటూ. నేను వెళ్ళేసరికి శాంతి అప్పుడే ఆఫీసు నుంచి వచ్చింది. ఆ ఇంట్లో ఏ హడావిడీ కనబడలేదు. పైగా అందరి మొహాల్లోనూ ఏదో బాధ. నన్ను చూడగానే తలదించుకుని, "అలా జాజి పందిరి దగ్గర కూర్చుందాం రా సునీతా" అంటూ రెండు కుర్చీలు తీసుకువెళ్తున్న శాంతితో, "ఈ కాఫీ తాగి వెళ్ళు" అన్నది వాళ్ళ అమ్మ.

"నాకొద్దు..." అంటూ వెళ్ళింది శాంతి.

"మా కాలంలో ఇవన్నీ తెలీవమ్మా..." అంటూ ఇంకేవేవో సాధించింది ఆవిడ కూతుర్ని.

శాంతి, నేను ఒకరి కెదురుగా ఒకరం బొమ్మల్లా కూర్చున్నాం. పది నిముషాల నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ, "నేను చాలా దురదృష్టవంతురాల్ని సునీతా !" అన్నది ఏదో చెప్పటానికి నాందిగా. ఆమె బాధను బరువుగా వచ్చిన ఆ మాటలవల్లే తెలుసుకుని మౌనంగా ఆమెవంకే చూస్తున్నాను.

"నా పెళ్ళి ఆగిపోయింది." అయిదు నిముషాల తర్వాత అన్నది.

"ఎందుకని ? అతను కాదన్నాడా?"

"కాదన్నది అతను కాదు ... అమ్మ !"

"అమ్మా ?"

"అవును...కులం లేనివాడికి గుణం ఉండదని, తన కూతురి సంపాదన చూసి అతను ఆశపడుతున్నాడని ఏమేమో అన్నది."

"అత నేమన్నాడు ?"

"శాంతి, నేను పెళ్ళిచేసుకున్నంత మాత్రాన మీ కేలోటూ రానివ్వమని, తాను కూడా ఇక్కడే ఉండి ఈ కుటుంబ బరువు బాధ్యతల్లో పాలుపంచుకుంటానని చెప్పాడు."

"ఇంకేం మరి ?"

"ఇద్దరు చెల్లెళ్ళున్నా చేతికి అంది వచ్చేవరకు నేను పెళ్ళిచేసుకోకూడదని అమ్మ వాదన."

"అందుకని నీ జీవితం నాశనం చేసుకుంటావా ? అంతగా అమ్మకు ఇష్టంలేకపోతే మీ రిద్దరూ రిజిష్టరు మ్యారేజి చేసుకోండి." ఆవేశంగా అన్నాను.

"అలా జరగదు సునీతా ! మధ్య తరగతికి చెందిన బహుకుటుంబీకులం మేం ! నేను అతణ్ణి రిజిష్టరు మ్యారేజి చేసుకుంటే అమ్మ నన్ని గడప తొక్కనివ్వదు. నేనే కాదు. ఆమెకు నా డబ్బు కూడా పనికిరాదు. దాంతో పిల్లల చదువులు ఆగిపోతాయి. గుట్టుగా నడుస్తున్న సంసారం వీధిన పడుతుంది. ఈ సమస్యలన్నీ నా స్వార్థపు ఆలోచనల్లో మరుగున పడిపోయాయి చూశావా ?"

"ఇందులో స్వార్థం లేంది ఎవరికి ? అయినా ఎవరి స్వసుఖం వాళ్ళు చూసుకోవాలి గాని, ఇలా నిస్వార్థానికి, త్యాగానికి జీవితాన్ని పణంగా పెట్టకూడదు."

"అదీ ఆలోచించాను సునీతా ! స్వసుఖంకోసం నేను తెంపరితనం చూపిస్తే, అందరూ ఉండీ ఎవరూ లేని దాన్నవుతాను. అతను ఎటూ ఒంటరి వాడు ! ఇది ఈనాటి సమస్య కాదు... ముందు ముందు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు పెద్ద సమస్యగా తయారవుతాయి" అన్నది దీర్ఘంగా నిట్టూరుస్తూ.

"ఇంత పిరికిదానివేం శాంతీ ! ? ఇవ్వాళ నీ ఇష్టంవచ్చిన పెళ్ళి నువ్వు చేసుకుంటే, ఎప్పుడో జరిగే నీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళదాకా ఈ సంగతి ఎవరు గుర్తు పెట్టుకుంటారు ? అయినా ఒకర్ని గురించి పట్టించుకొనే తీరిక ఈ సమాజాని కెక్కడిది? నీ డబ్బు మీ అమ్మకు పనికి రాకపోయినా పిల్లల చదువులకు ఉపయోగించు."

"అది అంత తేలిక కాదు సునీతా! డబ్బుగలవాళ్ళకు దాన్ని అనుభవించ



టంతో తీరిక ఉండదు. లేనివాళ్ళకు కష్టపడి సంపాదించుకోవటంతో తీరిక ఉండదు. మాలాంటి మధ్యతరగతి వాళ్ళకు ఎదుటివాళ్ళను ఏ రకంగా చిన్నచూపు చూద్దామా, ఎక్కడ అవకాశం దొరుకుతుందా వాళ్ళ చుట్టూ కథలు అల్లి వెలివేయటానికి అని ఎదురు చూస్తుంటారు. ఇంటికి పెద్దదాన్నిగా పుట్టినందుకు స్వార్థరహితంగా ఈ బాధ్యతల్ని నెత్తిన వేసుకోక తప్పదు" అన్నది భారంగా.

"మరొక్కసారి ఆలోచించుకో శాంతీ ! ఇంకో నాలుగేళ్ళ తరువాత ఇలాంటి అవకాశం మళ్ళీ రాకపోవచ్చు. మీ అమ్మగారు తన స్వార్థానికి నిన్ను ఉపయోగించుకుంటున్నారు. ఎవరి స్వార్థం వాళ్ళది. అయినా స్వార్థత్యాగం అంతిమదశలో కాని, యౌవనంలో కాదు" అంటూ లేచాను. శాంతి మౌనంగా గేటుదాకా వచ్చి నన్ను సాగనంపింది.

సంగతులు విన్న అమ్మ వారం రోజుల తరువాత మా ఇంటికి వచ్చిన శాంతిని, "ఏమిటమ్మా ! పెళ్ళిచేసుకుని

ళ్ళ చూసుకుంటే ఆ సంసారం గతేంకాను ? నాలుగు డబ్బులు సంపా ...న్నందుకు తోడబుట్టినవాళ్ళను ఆదుకోకపోతే ఎట్లా ?" అంటూ చనువుగా మందలించింది. సమాధానం చెప్పలేని శాంతి తలవంచుకున్నది.

ఆ తరువాత నెలరోజులకు నా పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళేటప్పుడు నాకు వీడ్కోలు ఇస్తూ నా కళ్ళల్లోకి చూసిన ఆనాటి శాంతి చూపు నా కిప్పటికీ గుర్తే !

నా కళ్ళల్లో కాంతి, తన చూపులో నైరాశ్యం.

నా మనసు నిండా కోరికలు, తన మనసులో స్తబ్ధత.

నా ఆలోచనలు కొత్త జీవితాన్ని గురించి, తన ఆలోచనలు జరిగిన సంఘటనల్ని గురించి.

నా ఊహలు విహంగాలైతే తన ఊహలు రెక్కలు తెగిన పక్షులు.

నేను తలపోస్తున్నది మెట్టినింటిని గురించి, తన బాధ పుట్టినింటిని గురించి.

ఆ క్షణంలో ఇద్దరి కనురెప్పలు మూతపడలేదు, ఇద్దరి పెదవులు విడివడలేదు. మా ఇద్దరి హృదయాలు మూగగా రోదిస్తున్నాయి. ఇద్దరి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వేడిగా ఉన్నాయి.

మా నాలుగు నేత్రాలు బరువైన కన్నీటిని దాచుకోలేక సతమత మౌతున్నయ్ !


"పదమ్మా! వేళవుతున్నది." అన్న గారి మాటతో ఈ లోకంలోకి వచ్చిన నేను త్వరత్వరగా అడుగులు వేసుకుంటూ ముందుకు వెళ్ళిపోయాను.

నాతోపాటు అడుగులువేసి నన్నందుకోలేని శాంతి అక్కడే ఆగిపోయింది.

ఆ తరువాత కొన్నాళ్ళకు వాళ్ళకు బదిలీ అయి ఇంకో ఊరు వెళ్ళిపోయారు.

అప్పుడప్పుడు నేను వస్తే అమ్మ చెప్పిన దేమిటంటే, శాంతి పెద్ద చెల్లెలికి పెళ్ళిచేసిందని, రెండో చెల్లెలు ఎవర్నో ప్రేమించి తనే పెళ్ళిచేసుకుందని, మూడోది పెళ్ళిమీద విశ్వాసంలేక ఎవరితోనో ఉంటున్నదని, దాని పెద్ద తమ్ముడు ఎలిమెంటరీ స్కూలు టీచరైనందున తల్లిని పోషించలేక శాంతి దగ్గర వదలితే, చిన్న తమ్ముడు అమెరికా వెళుతూ తల్లిని తీసుకువెళ్ళటానికి వీల్లేక తన కుటుంబాన్నిమాత్రమే తీసుకువెళ్ళాడని. అయితే అందరూ ఎవరి సంగతి వాళ్ళు చూసుకుంటే, అందరికీ అండగా నిల్చిన శాంతి అశాంతి పాలైంది.

పొద్దున అమ్మ చెప్పిందేమిటంటే, శాంతి రిటైరయి తల్లితోసహా ఇక్కడే ఉంటున్నట్లు, కొన్ని నెలలక్రితం




మెంటల్ ఎఫెక్టు వచ్చి కొంత కోలుకున్నా, చిన్ననాటి స్నేహితురాళ్లెవరన్నా కనిపిస్తే, "నాకూ పెళ్ళవుతుందేవ్ ? మీరంతా వస్తారుగా ? అంటూ పిచ్చిగా మాట్లాడుతుందని. నిజమే మరి. పచ్చగా పువ్వులు పూసి, కాయలుకాసిన చెట్టును చూసి ఎంత చక్కగా ఉన్నది అని అభినందిస్తాం కాని, పూయలేకపోయిన దాన్నిగురించి సానుభూతి చూపించం.

తన తల్లి స్వార్థానికి శాంతి తను చేయూత నిచ్చింది. తోడబుట్టినవాళ్ళ అభివృద్ధికి అండగా నిల్చింది. తండ్రి బాధ్యతారహిత ప్రవర్తనకు తను బాధ్యత వహించింది. తల్లి వృద్ధాప్యంలో తనే తోడయింది. కాని లోకం దృష్టిలో శాంతి పిచ్చిది. ఎప్పుడో మెంటల్‌గా దెబ్బతిని కోలుకున్నా ఇంకా పిచ్చిదానిగానే చలామణి చేస్తున్నారు. దాన్ని చూసిన నాకు, తనకూ పెళ్ళవుతుందన్న ఆశ తోనే అది జీవిస్తున్నట్లు అనిపించింది.

వాకిట్లోనుంచి ఏవో అరుపులు వినిపించటంతో ఈ లోకంలోకి వచ్చిన నాకు బయట జుట్టు విరబోసుకుని, పెద్దగా నవ్వుతూ, "నాకూ పెళ్ళవుతుంది. నాకూ పెళ్ళి కుదురుతుంది" అని తనలో తనే మాట్లాడుకుంటూ నడుస్తున్న శాంతి కనిపించేసరికి దాని పరిస్థితికి రెండు కన్నీటిబొట్లు తప్ప మరేమీ ఇవ్వలేక తలవంచుకుని లోపలికి నడిచాను బాధగా !

— — —